## కార్మికుల సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రొగ్రెసివ్ ఆటో అండ్ మోటర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐదో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నామని చెబుతున్న దేశంలో ఇంత దారిద్ర్యం ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోర్డును ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. యూనియన్ అధ్యక్షుడు వి.ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.అన్మేష్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ, లింగంగౌడ్, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా రథోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారిని శృంగార రథోత్సవంపై అధిరోహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు ఆలయ వంశీకుడు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయుల ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ట, మహానివేదన, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం పతాధివాసం, హవనం, భేరిపూజ, దేవతా హ్వానం, హవననం, బలిహరణనం నిర్వహించారు. అలాగే ఆలయంలో లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు నిర్వహించారు. కాగా బుధవారం పూర్ణాహుతి, చక్రతీర్థం, ద్వాదశారాధన, శ్రీ పుష్ప యాగం, దేవతోద్వాసన ఉంటుందన్నారు. గురువారం ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుందని, ఈ సందర్భంగా స్వామి వారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇస్తామన్నారు. అదే రోజు రాత్రి స్వామి వారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు.

## ఏజెన్సీ ఉద్యోగాలను స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలి

కాచిగూడ: రాష్ట్రంలో డీఎస్సీ –2024 నోటిఫికేషన్ ప్రకటనలో ఆర్టికల్ 244(1) అనుసరించి ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలను స్థానిక గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్ రాథోడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్‌కు మంగళవారం వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో ఏజెన్సీ డీఎస్సీ, జనరల్ డీఎస్సీ రెండు రకాల నోటిఫికేషన్లు ప్రకటించాలన్నారు. జనరల్ డీఎస్సీతో షెడ్యూల్డ్ ఏరియా ప్రాంతంలో రాజ్యాంగ ఉల్లంఘనతో పాటు స్థానిక గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ)లకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్‌కు వినతి పత్రం ఇస్తున్న రాజేశ్ నాయక్

## జాబ్‌మేళాతో నిరుద్యోగులకు మేలు

కవాడిగూడ: జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందని గాంధీనగర్ సీఐ రాజు అన్నారు. కవాడిగూడ డివిజన్‌లోని విరజానంద విజ్ఞానకేంద్ర ఆర్యసమాజ్ కవాడిగూడ, ఆరైజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాబ్‌మేళాకు 224 మంది నిరుద్యోగులు హాజరుకాగా దాదాపు 74 మంది యువతీ యువకులు ఎంపిక కాగా కవాడిగూడ కార్పొరేటర్ జి. రచన శ్రీ వారికి అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకోసం ఎదురు చూడకుండా ఇలాంటి జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని సూచించారు. ఈ సందర్భంగా జాబ్‌మేళా నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో విరజానంద వైదిక్ విద్యాలయ అధ్యక్షుడు పి. జనార్దన్, కార్యదర్శి గడిల ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి వనజకుమార్, ఆర్‌ఎస్‌ఎస్ సికింద్రాబాద్ విభాగ్ కార్యదర్శి భరతపూడి శ్రీనివాస్, అరైజ్ ఫౌండేషన్ డైరెక్టర్ నీలకంఠ మహాదేవ్, సెక్రటరీ ప్రవీణ్, కోశాధికారి సీత, సంతోష్, సంజీవ, శంకర్, మనోహర్, శ్రీకాంత్, స్వాతి, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు ఎ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, బీజేపీ నేతలు నర్సింహాచారి, బొల్ల రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ ,ఆంజనేయులు

## ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ల అందజేత



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అంజేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు సంబంధించిన రూ.78 లక్షల 28వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను పూర్వ కోశాధికారి పి.రాజేశ్వర్‌రావు చిక్కడపల్లి కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక కార్యదర్శి, పూర్వ కోశాధికారి పి.రాజేశ్వర్‌రావు, మాజీ కార్యదర్శి కోయ చంద్రమోహన్, నూతన అధ్యక్షుడు యాకూబ్, కోశాధికారి పి.నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల పెంపు తర్వాతే స్థానిక ఎన్నికలు

కాచిగూడ: తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, టి.రాజ్‌కుమార్, నిరంజన్, నిఖిల్‌లతో కూడిన ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కుల గణన జరిపిన తర్వాత బీసీల పంచాయతీరాజ్ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 29 శాతం నుంచి బీసీల జనాభా ప్రాతిపదికన 50 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. క్రిమిలేయర్‌ను తొలగించాలని, ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న 11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు.



రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

## కాలు తగిలించాడంటూ కత్తితో దాడి

రహమత్‌నగర్: కాలు తగిలించాడంటూ ఓ వ్యక్తి మరొకరిపై కత్తితో దాడి చేసి గాయపర్చిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీస్ కథనం ప్రకారం ... ఎర్రగడ్డ డివిజన్ నేతాజీ నగర్‌కు చెందిన మహ్మద్ హుస్సేన్(25) రైతుబజారు వద్ద పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. పక్కనే ఉన్న టీ స్టాల్ యాజమాని మునిస్వామి నాయక్‌కు, హుస్సేన్‌కు మధ్య అప్పటికే వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే మునిస్వామి మిత్రుడు శివకుమార్ సోమవారంరాత్రి 10 గంటల ప్రాంతంలో టీస్టాల్ వద్దకు వెళ్లాడు. అప్పుడే టీస్టాల్ వద్దకు చేరుకున్న హుస్సేన్.. తనకు కాలు ఎందుకు తగలించావంటూ కత్తితో శివకుమార్‌పై దాడి చేశాడు. మునుస్వామి నాయక్, అతని భార్య, అక్కడి ఉన్న ప్రజలు అడ్డుకోవడంతో హుస్సేన్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనలో శివకుమార్ మెడపై గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ భూపాల్‌గౌడ్ నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



ముసారంబాగ్ ప్రాంతంలో మూసీనదిపై నిలిచిన వంతెన పనులు

# అటకెక్కిన వంతెన పనులు..!

**ముసారంబాగ్ మూసీ నదిపై రూ. 55 కోట్లతో నిర్మాణం**

- ఇప్పటివరకు రెండు ఫిల్లర్లే నిర్మాణం
- మిగతా పనులకు విద్యుత్ కేబుళ్ల అడ్డంకి
- నెలరోజులుగా నిలిచిన పనులు
- నిధులు మంజూరు చేస్తేనే తొలగిస్తామంటున్న ఆ శాఖ అధికారులు
- నిత్యం వేలాది మంది వాహనాదారుల అవస్థలు

అంబర్‌పేట: ముసారంబాగ్ మూసీ నదిపై చేపట్టిన వంతెన పనులు ఆదిలోనే అటకెక్కియి. అంతర్జాతీయ స్థాయిలో డిజైన్ రూపొందించి సుమారు రూ.55 కోట్ల అంచనా వ్యయంతో ఎంతో హడావిడిగా పనులు ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు రెండు ఫిల్లర్లు మాత్రమే వేసి వదిలివేయడంతో తిరిగి మళ్లీ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొన్నది.

### పొంచిఉన్న వర్షాకాలం..

భారీ వర్షాలు కురిసినప్పుడల్లా మూసారంబాగ్ మూసీ పొంగిపొర్లుతుంటుంది. పాత బ్రిడ్జిపై నుంచి భారీగా నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ప్రస్తుతం పాత బ్రిడ్జిపై ఒకవైపు రాకపోకలు కొనసాగిస్తూ మరోవైపు వంతెన పనులు చేపడుతున్నారు. ఈ యేడు భారీ వర్షాలు కురిస్తే ఇప్పటివరకు చేపట్టిన పనులు కూడా దెబ్బ తినే అవకాశం లేకపోలేదు.

### ట్రాఫిక్‌తో నిత్యం నరకం..

అంబర్‌పేట, విద్యానగర్, నల్లకుంట, నారాయణగూడ ప్రాంతాలు, దిల్‌షుక్‌నగర్, మలక్‌పేట్, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్, ప్రధాన ప్రాంతాలకు మూసారంబాగ్ వంతెన ప్రధాన వారధి. ఈ బ్రిడ్జిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రస్తుతం ఒకవైపు బ్రిడ్జి పనులు సాగుతుండడంతో మరోవైపు నుంచి మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. మలక్‌పేట నుంచి అంబర్‌పేట వైపు వాహనాలను అనుమతించి అంబర్‌పేట నుంచి మలక్‌పేట వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు అంబర్‌పేట ప్రధాన రోడ్డులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు ఆరేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. అక్కడ కూడా ట్రాఫిక్ మళ్లించారు. ఒకే మార్గంలో రెండు చోట్ల ట్రాఫిక్ మళ్లింపు ఉండడంతో అంబర్‌పేట ప్రాంతానికి వాహనదారులు రావాలంటేనే భయందోళన చెందుతున్నారు.

### విద్యుత్ కేబుళ్ల తొలగింపు తర్వాతే పనులు : సురేశ్, ఈఈ ప్రాజెక్ట్స్

ముసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణం ప్రాంతంలో విద్యుత్ కేబుళ్లను తొలగించి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు నిధులు కేటాయిస్తే కేబుళ్ల తొలగింపు పనులు చేపడుతామని చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే కేబుళ్లను తొలగించిన అనంతరం తాము తిరిగి వంతెన పనులు ప్రారంభిస్తాం.

### 31న వార్షిక వేడుకలు

చిక్కడపల్లి: ఈ నెల 31న శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీ 24వ వార్షిక వేడుకలను శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చింతలపాటి సురేశ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డు జడ్జి జస్టిస్ నాగమారుతీశర్మ హాజరై శ్రీ భారతి ఫౌండేషన్ లోగో ఆవిష్కరిస్తారన్నారు. అలాగే ప్రముఖ లలిత సంగీత స్వరకర్త ములగలేటి గోపాలాకృష్ణను శ్రీభారతి జీవన సాఫల్యపురస్కారంతో సత్కరించి లలితసంగీత భారతి బిరుదును ప్రదానం చేస్తారని తెలిపారు. కవి డాక్టర్ ఎంకె రాము అధ్యక్షత వహించే సభలో తిరుమల గ్రూప్ చైర్మన్ నుంగునూరి చంద్రశేఖర్, ప్రముఖులు రాజేశ్వర్‌రెడ్డి, వడ్డి సుబ్బారావు, ఎస్‌సీ శ్రీనివాస్ తదితరులు అతిథులుగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో శ్రీ భారతీయం పేరిట సురేశ్ నిర్వహనలో సురేఖ, వీకే దుర్గ ఆమని అమృతవల్లి తదితరులుతో ఆధ్యాత్మిక, సామాజిక, తత్వప్రబోధ చైతన్య గీతాల గాన విభారి ఉంటుందని ఆయన చెప్పారు.

### అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు

చిక్కడపల్లి: అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ అన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్న ఆ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్‌ను మంగళవారం సాయంత్రం నేతలు సన్మానించారు. ఈ సందర్భంగా అభిషేక్ కెనడీ మాట్లాడుతూ పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నేతలు ఎస్.అంజిరెడ్డి, జానకీసు ధాకర్, గోనే సల్మాన్‌రాజు, సబ్బు, భాస్కర్‌రెడ్డి, నర్సింగరావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### 'బీసీలనే వీసీలుగా నియమించాలి'

కాచిగూడ: తెలంగాణలోని పలు విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్స్‌లర్లుగా బీసీలను నియమించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఇటీవల తాత్కాలికంగా 10 మంది ఐఏఎస్‌లను వైస్ చాన్స్‌లర్లుగా నియమించిందని, ఇందులో ఐదుగురు బీసీ ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాలని కోరారు. లేకుంటే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్‌లోని బీసీ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వీసీలుగా బీసీలు నియమితులయ్యేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### అడిషనల్ ఏజీ పోస్టును మాదిగలకు కేటాయించాలి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా హైకోర్టులోని అడిషనల్ అడ్వకేట్ జనరల్ పోస్టును మాదిగలకు కేటాయించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్ రాజు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తమ జాతికిచ్చిన హామీలు నెరవేర్చడంలో సానుకూల ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు, మూడు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఈ విషయంపై వినతిపత్రం అందజేస్తామని వెల్లడించారు. ఉపేందర్, జయరామరాజు, మల్లేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి



బీసీ గురుకులాల కార్యదర్శి సైదులుకు వినతిపత్రం ఇస్తున్న ఆనంద్‌గౌడ్ తదితరులు

అంబర్‌పేట: బీసీ గురుకులాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ఆ విద్యా సంస్థల కార్యదర్శి సైదులును ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో విద్యాసంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు తాగునీరు, పారిశుధ్యం వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి నెల చెల్లించే కాస్మోటిక్ చార్జీలను తక్షణమే చెల్లించాలని, అలాగే పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఆరోగ్య శాఖకు సంబంధించిన సిబ్బందిని తక్షణమే నియమించాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు ఈశ్వరప్ప, సురేందర్ యాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబరావుకు ఘన నివాళి



కుటుంబరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముషీరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఆటో యూనియన్ నాయకుడు కుటుంబరావు వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లోని సీపీఐ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుటుంబరావు తన జీవితం పార్టీకే అంకితం చేశారన్నారు. ఆటో కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో చిట్టుపాటి వెంకటేశ్వర్లు, సీఎస్.సాగర్, కె.గోవర్ధన్, జి.అనురాధా, వేణు, పి.నాగరాజు, బి.తిరుమల్‌రెడ్డి, భారతి, తీగల శ్యామ్, లోకేష్, మల్లిక్, రేణుక, సర్వేష్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

అంబర్‌పేట: డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి అన్నారు. మహంకాళి ఆలయం లేన్, బూరుజుగల్లీ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల సమస్య, మట్టికుప్పలు పేరుకుపోయాయని స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆమె ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేయవద్దని అధికారులకు సూచించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు, క్షేత్రస్థాయి జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఉన్నారు.



మట్టికుప్పలు తొలగింపజేయిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

## ఆన్‌లైన్‌లో నగదు పంపుతానని మోసం

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో నగదు పంపుతానని యువకుడి వద్ద నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వినుకొండకి చెందిన తోట మోహన్ శ్రీకృష్ణానగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్నారు. ఈ నెల 27న మధురానగర్ మెట్రో వద్ద ఉన్న ఎస్‌బీఐ వద్దకు వెళ్లి రూ.24 వేలు డిపాజిట్ చేయడానికి ప్రయత్నించగా క్యాష్ తనకు ఇస్తే ఆన్‌లైన్‌లో వేస్తానని చెప్పాడు. దాంతో మోహన్ ఆ నగదును సాయికి ఇచ్చాడు. దానిని తీసుకుని సాయి పారిపోయాడు. బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

### మాట్లాడుతుండగానే..

వెంగళరావునగర్: రెండు వేర్వేరు ఘటనల్లో సెల్‌ఫోన్లు దొంగతనానికి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. అమీర్‌పేటలో నివసించే దుర్గారావు సోమ వారం తెల్లవారుజాము భద్రాచలం నుంచి వస్తున్న తన స్నేహితురాలిని పికప్ చేసుకోవడానికి మైత్రీవనం వచ్చాడు. ఫోన్‌లో మాట్లాడుతుండగా ఇరువురు యువకులు వచ్చి లాక్కెళ్లారు. చింతల్ ప్రాంతంలో ఉండే ఓం శ్రీనివాస్ మంగళవారం అర్ధరాత్రి గుంటూరు నుంచి వస్తున్న భార్యను రిసీవ్ చేసుకునేందుకు మైత్రీవనం వచ్చాడు. ఈ క్రమంలో ఫోన్‌లో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఫోన్ లాక్కుని పారిపోయారు. దాంతో ఇరువురు బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని పలు ఫీడర్లలో ఈ నెల 29న (నేడు) విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోల్నాక, తిలక్‌నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జైస్వాల్ గార్డెన్, మారుతీనగర్, తిరుమలనగర్, తిలక్‌నగర్, చే నంబర్ క్రాస్ రోడ్డు, అంబర్‌పేట్ మెయిన్ రోడ్డు, తులసీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు తులసీనగర్, గోల్నాక, చే నంబర్ మెయిన్ రోడ్డు, సీఎస్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శివం, శారదనగర్, సాయిబాబానగర్, ఈసేవా, బాగ్ అంబర్‌పేట్, అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గటల వరకు సాయిదత్తా నర్సింగ్ హోమ్, శివం, టెలిఫోన్ ఎక్ఛేంజ్, మల్లికార్జుననగర్, ఎరుకల బస్తీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## 'ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం శిక్షార్హుడే'



మాట్లాడుతున్న వెంకటస్వామి

కాచిగూడ: ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ శిక్షార్హుడని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సూదమల్ల వెంకటస్వామి అన్నారు. నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో నేతలు గోరశ్యామ్ సుందర్, మాదరబోయిన నర్సయ్యతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలను అదుపులోకి తెచ్చుకొనే ఆలోచనలతో అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు మాజీ పోలీసు అధికారులు ఇప్పటికే చెప్పారన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, వారిని శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు.

## ఓట్ల లెక్కింపునకు చురుగ్గా ఏర్పాట్లు



బర్కత్‌పుర రెడ్డి కళాశాలలో డీఆర్‌సీ కేంద్రంలో అధికారులు

అంబర్‌పేట: పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధించి బర్కత్‌పుర రెడ్డి కళాశాలలోని డీఆర్‌సీ కేంద్రాన్ని మంగళవారం అధికారులు పరిశీలించారు. పరిసరాల్లో భారీకేడ్ల ఏర్పాటు, లెక్కింపు రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు మారుతీదివాకర్, వీరాబాయి, రవీందర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వీర సావర్కర్ చరిత్రను తెలుసుకోవాలి



వీరసావర్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్

కాచిగూడ: వీర సావర్కర్ దేశానికి చేసిన సేవలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం వీర సావర్కర్ జయంతి సందర్భంగా కాచిగూడ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సావర్కర్ పుస్తకాలు, సినిమా చూస్తే ఆయన త్యాగాలు తెలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, సి.నందకిశోర్ యాదవ్, కన్నె రమేశ్‌యాదవ్, సుభాష్ పటేల్, వాసు, రాము, అశోక్ కులకర్ణి, శిర్‌సాగర్, దిలీప్, హజారిబాబు, మల్లికార్జున్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి



రాంనగర్ మీసేవా కేంద్రం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాంనగర్ మీసేవా కేంద్రం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అన్నదానం చేపట్టారు. అనంతరం వి.శేఖర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ పేదల శ్రేయస్సు కోసం ఎంతో శ్రమించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవల్లిక

చిక్కడపల్లి: వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని టీఆర్‌టీ గ్రౌండ్ వార్డు కార్యాలయ బస్తీ దవాఖాన ఇన్‌చార్జి డాక్టర్ ప్రవల్లిక సూచించారు. ఆమె మంగళవారం పలువురికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అత్యవసర పనులుంటే తప్ప మధ్యాహ్నం బయటకు వెళ్లవద్దని సూచించారు. నీరసంగా అనిపిస్తే ఓఆర్‌ఎస్ పౌడర్ నీళ్లల్లో కలిపి తాగాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, నర్సులు పాల్గొన్నారు.